పసిడి చెక్కిళ్లు

శకుంతల వాకిటి అరుగునానుకుని కొంగుతో కళ్ళు ఒత్తుకుంటూ నిలబడి పోయింది. "ఇవాళ నాకేదో దయ్యం పట్టింది. లేకపోతే ఐదేళ్ల పిల్లవాడిని పట్టుకుని అంతంత దెబ్బలు కొడతానా ? ఇదివరకూ వాడు ఎన్నిసార్లు మారాము చెయ్యలేదు ? వాడు అలా మారాము చేసినప్పుడు తను ఎన్నిసార్లు మరిపించి బుజ్జగించి సర్దలేదు ?" పెద్దపిల్ల సుమ దేనికో ఒకదానికి పేచీ పెడుతూనే ఉంటుంది. ప్రతి పండక్కి కొత్త గౌనుకోసమో పరికిణీ కోసమో మారాము చేస్తూ ఉంటుంది. తను సర్ది చెబుతుంది. ప్రతిమిలాడుతుంది. కాని ఎవరిమీదా ఇంతవరకూ చెయ్యి చేసుకోలేదు. తనలో తను గొణుక్కుంటోంది.

శకుంతలకు ఏదో ఆవేదన తపన- ఊపిరాడనీయకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వీపుమీద దెబ్బ పడ్డప్పుడల్లా అమ్మో అమ్మో అంటూ గావుకేకలు పెట్టి ఏడ్చిన కిట్టూ కళ్ళముందర నిలబడినట్టుగా ఉంది. కిట్టూను కొట్టిన చేతులను అసహ్యించుకుని గోడకేసి బాదింది. మంటలెత్తిన చేతులను "కిట్టూను నిర్దాక్షిణ్యంగా బాదలేదూ ? అంతే, అనుభవించండి" అన్నట్టుగా దూరంగా విసిరింది.

శకుంతల కళ్ళు అప్రయత్నంగా మేడమీది బాల్కనీవైపు మళ్లాయి. రేఖ ఏడాది పసిబిడ్డను ఎత్తుకుని బిస్కెట్టు తినిపిస్తున్నది. ఆ బిడ్డ ఆరోగ్యంగా బొద్దుగా ముద్దుగా నవ్వులు చిందిస్తున్నాడు. ఆ బిడ్డ నవ్వుచూసి రేఖ మురిసిపోతున్నది.

శకుంతల కళ్ళు భగ్గుమన్నట్లయింది. కడుపులో మంట లేచినట్లయింది. "ఏమిటా మురిపెం ? పిల్లలు తనకొక్కదానికే ఉన్నారా ? వీధి కెదురుగా నిలబడి ఆ ముద్దులేమిటి ?" ఈసడించినట్టుగా ముఖం పెట్టింది.

కడుపులో బాధ మసులుతున్నట్టుగా ఉంది. కిట్టూను కొట్టినచేతులు భగ్గు భగ్గున మండిపోతున్నాయి శకుంతల తనను తాను తిట్టుకున్నది. శపించుకున్నది.

నిజానికి కిట్టూది ఏం తప్పు? ఆ పసి హృదయం చూసినదల్లా కావాలని అడుగుతుంది. తోటి పిల్లలకు ఉన్న వస్తువు తనక్కూడా ఉంటే బాగుంటుందని మనసు ఆక్రోసిస్తుంది. ముగ్గురు పిల్లలకు అన్న అనే పేరేగాని ఇంతాచేస్తే కిట్టూకి ఎన్నేళ్ళని? ఐదు సంవత్సరాలు వెళ్ళి ఆరో ఏడు నడుస్తున్నది. వాడికే ముద్దు జరిగింది? ముద్దుమాట అలా ఉంచి వాడికి ఏ వేళకు కావలసినవి ఆ వేళకు ఏమి అమిరాయి? ఏడాది వెళ్ళీవెళ్ళకుండానే మణికి అన్న అయిపోయాడు. అంతే. ఆ మరునాటి నుంచీ ఏడ్చిన అరగంటకు విసుక్కుంటూ ఇన్ని నీళ్ళపాలు ఎవరో ఒకరు తాగించేవారు. బట్టలు తడుపుకుంటే మార్చేవారు లేరు. ఒంటినే ఎండిపోయేవి. తనకు చెయ్యి తీరదు. అట్లా చూస్తూ ఉండగానే కిట్టూ తరువాత ముగ్గురు పిల్లలు వరుసగా పుట్టారు. నాలుగోబిడ్డ ఇంకా రెండుమూడు నెలల్లో వెలుగు చూడబోతున్నది.

కిట్టూ చాలా తెలివి కలవాడు. బుర్ర చిన్నదేకాని పెద్దపెద్ద ఆలోచనలు చేస్తాడు. వాడు ఒక్కొక్కమాట మాట్లాడితే కడుపు ఉబ్బేటట్టు నవ్వు వస్తుంది. ఒక్కోసారి మాట్లాడితే ఎంతోసేపు ఆలోచిస్తేగాని అర్థం స్ఫురించదు. ఒక్కోసారి బాణం దూసుకుపోయినట్టుగా గుండెలోనుంచి దూసుకుపోతుంది. కొంటె కొంటెగా మాట్లాడినట్టే మాట్లాడి చురక తగిలిస్తాడు. పిల్లలందరిలోకి కిట్టూ అంటే తండ్రికేదో ప్రత్యేకత ఉన్నట్లే చూస్తాడు. తనకయినా అంతే. ఒక చెంప భయంభయంగా ఉంటుంది. ఒక చెప్ప ఏడ్చాడులే అన్న నిర్లక్ష్యం. అయినా ఇదంతా వాడిని చూడగానే ఎక్కడివక్కడ మాయమయిపోతాయి. ఎంతో సంతోషం- ఎంతో గర్వమూ కలుగుతాయి.

వారంరోజుల కిందట మేడమీద కాపరమున్న రేఖ తన పెద్దకొడుకు రఘు పుట్టినరోజుకు ఆ చుట్టుప్రక్కల ఉన్న పిల్లలందరినీ పిలిచి పళ్లూ మిఠాయి పంచిపెట్టింది. ఆ రోజు రఘు రంగురంగుల గళ్ళసూటు వేసుకున్నాడు. నిండైన బుగ్గలతో కన్ను చెదిరే డ్రెస్సుతో మతాబాలా వెలిగిపోతున్నాడు రఘు. సాయంకాలము నాలుగు గంటలకు వెళ్ళిన కిట్టూ ఏడు గంటలయినా మేడదిగి రాలేదు. పిల్లలకు అన్నాలు పెట్టి విధ్రబుచ్చి కిట్టూను పిలవటానికి మేడమీదికి వెళ్లింది శకుంతల. రేఖ తనకొడుకు పుట్టినరోజు అంత ఆడంబరంగా చేయటం తన గొప్పతనము చాటుకోవటానికి కాకపోతే ఇంకెందుకు అనిపించింది శకుంతలకు.

రేఖ యింట్లో హాల్లో ట్యూబులైటు వెలుగుతోంది. పిల్లలు మిఠాయి తిన్న ప్లేట్లదొంతర ఒకమూలగా పెట్టి ఉన్నది. అందరూ వెళ్లిపోయినట్లున్నారు. రఘుకు దగ్గరగా కిట్టూ కూర్చుని అతడి గళ్ళసూటును చేత్తో తాకి చూస్తూ "చాలా బాగుందోయ్" అంటున్నాడు

"అమ్మ షాపుకెళ్ళి రెడీమేడ్ తెచ్చింది ఎంతో తెలుసా, పద్దెనిమిది రూపాయలు చాకలికి వేసినా రంగుపోదట. హేంగరుకు తగిలించి పెట్టుకుని ఎప్పుడు కావాలంటే అప్పుడు వేసుకోవచ్చు. రేపు స్కూలుకు ఇదే వేసుకువస్తాను" అంటున్నాడు రఘు గర్వంగా

కిట్టూ ఆ సూటువంక ఆశగా చూస్తున్నాడు. ఆ దృశ్యం చూసిన తరువాత కడుపులో బాధ మెలిపెట్టి నట్లయింది శకుంతలకు.

"కిట్టూ ఇంటికి పోదాం రా." అన్నది ఆ బాధనుంచి తప్పించుకోవటానికి.

"కొంచెం ఉండమ్మా" కిట్టూకి ఆ సూటువంక ఎంతసేపు చూసినా తనివి తీరటంలేదు.

శకుంతల మాట వినగానే రేఖ లోపలినుంచివచ్చి "కూర్చోండి" అన్నది.

"పిల్లలు పడుకొన్నారు. కిట్టూ కోసం వచ్చాను" అంటూనే ఒక నిమిషం సేపు చాపమీద కూర్చుంది తలతిప్పి నాలుగువైపులా చూస్తూ.

"ఉవాళ మా రఘు పుట్టినరోజు వాడు తన స్నేహితులనందరినీ పిలవమని పట్టుబట్టాడు. వాడి మాటంటే వాళ్ళ నాన్నగారు కూడా సరేనరే అంటారు అందుకనే పిల్లల నందరినీ పిలిచాను" అన్నది రేఖ.

తల ఆడించింది శకుంతల. "రండి మా యిల్లు చూద్దురు గాని" అంటూ లోపలికి తీసుకెళ్ళింది రేఖ ఇల్లంతా చూసిన శకుంతల మనసు అదోలా అయి పోయింది. రేఖభర్త తనభర్త ఒక ఆఫీసులోనే పనిచేస్తారు. ఒక గ్రేడులోనే ఉన్నారు కాని తన సంసారానికీ, రేఖ సంసారానికీ ఎంత తేడా కనబడుతోంది, రేఖ ముఖంలో ఎంతో తృప్తి కనబడుతోంది సంతృప్తితో కూడిన ఆనందమే ఆమె ముఖంలోని వెలుగు. తనకో, ఎప్పుడూ ఎడతెగని ఆలోచనలు, ఎప్పుడూ చికాకూ- కోపమూ- చిటపటలతో తనకు తిన్నది వంటపట్టదు.

రేఖ సంసారాన్ని చూసిన శకుంతల తన దురదృష్టాన్ని తలచుకుని ముఖం గంటు పెట్టుకుంటూ "రారా కిట్టూ, ఇంటికి పోదాం" అని కేక పెట్టింది.

కిట్టూ "ఇప్పుడే రాను. ఇంకాసేపుంటా"నని మారాముచేస్తున్నా బరబర లాక్కెళ్ళింది.

కిందికి వచ్చిన తరువాత "ఏమిట్రా ! దేబిరి గొట్టులా వాడి ముందుకూర్చు న్నావు ? వేళకు ఇంటికి రావాలని తెలియదూ ?" గది లోపలికి ఒక్క తోపు తోసింది.

కళ్ల నీళ్ళు చేత్తో తుడుచుకుంటూ పైకి ఏడిస్తే తల్లి కొడుతుందని ఏడుపు మింగుతూ లోపలికి వెళ్ళి పెట్టిన అన్నం తిని పడుకున్నాడు కిట్టూ.

కిట్టూ ముఖం చూడగానే శకుంతలకు జాలికలిగింది కళ్ళల్లో నీటిపొర తేలియాడింది. కాని కడుపులో ఏదో చెప్పలేని బాధ-కసి ఆమెకు ఊపిరాడకుండా చేయటం మొదలుపెట్టాయి. పిల్లలను పడుకోబెట్టి వాళ్ళను చూస్తూ గోడకానుకుని కూర్చుని ఎడతెగని ఆలోచనలలో చిక్కుకు పోయింది కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

తనతండ్రి ఆరువేల రూపాయల కట్నమచ్చి ఈ పెళ్ళి చేశాడు కాపరానికి వస్తూనే పిల్లల సందడి. డాక్టర్లూ మందులూ, మరదులకూ ఆడబడుచులకూ చదువుల కోసం. పెళ్లిళ్ళకోసం డబ్బు పంపాలి. ఎంతకని ఆ జీతం సరిపోతుంది ? ఎన్నిటి కని సరిపెట్టగలుగుతాడు ఆయన మాత్రం ? నెలలో పదిరోజులు డబ్బును గురించిన ఘర్షణలు భార్యాభర్తలకు. ఒకరి నొకరు అర్థం చేసుకోలేకనా ? ఒకరి మీద ఒకరికి అనురాగం లేకనా ?

కాదు.

మరునాడు సెలవు. పిల్లలు ఆలస్యంగా నిద్రలేచారు. కిట్టూ లేచి స్నానం టిఫిన్ చేసిన తరువాత తల్లి దగ్గరచేరి "అమ్మా ! నాకు రఘుకున్నటువంటివంటి గళ్ళసూటు కొనవూ ?" అడిగాడు.

శకుంతల పిల్లవాడి ముఖంలోకి చూసింది. రబ్బరు బొమ్మలా ముద్దొస్తు న్నాడు. అడిగే తీరు చూస్తే మనసు కరిగి పోతున్నది. కాని అంతలోనే మనసు

గట్టి చేసుకుని "ఏమిట్రా ? ఏది చూస్తే అదే కావాలంటావు ? నీకు కొంటే అందరికీ కొనొద్దూ ?" కసిరి కొట్టింది.

"అమ్మా ! ఇంకేమీ అడగనమ్మా. అదొక్కటే కొను. ఇప్పుడు కాక పోతే పోనీ-నా పుట్టిన రోజుకు కొనవూ? నా పుట్టిన రోజుకు కూడా నా స్నేహితు లందర్నీ పిలిచి మిఠాయి పెట్టవూ అమ్మా !" దీనంగా చూస్తూ బ్రతిమిలాడుతూ తల్లి కళ్ళలోకి చూశాడు.

"సరేలే. వాళ్ళేదో చేశారని నన్ను కూడా చెయ్యమంటావా?" కేకలేసి పనిలో మునిగిపోయింది

ముఖం చిన్న బుచ్చుకుని కిట్టూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

శకుంతలకు ఆ కోరిక కిట్టూ కోరినట్టుగా లేదు. ఎవరో గిట్టని వాళ్లు తనను అవమానపరచటానికి అడుగుతున్నట్టుగా ఉంది. కోపంతో దేహం దహించుకు పోవటం మొదలు పెట్టింది. కిట్టూ మీద అనవసరంగా కోపం వస్తోంది. వాడిని చీటికీ మాటికీ కారణం లేకపోయినా చివాట్లు వెయ్యాబుద్ధి పుడుతున్నది.

సరిగ్గా వారానికే కిట్టూ పుట్టిన రోజు వచ్చింది. రేపు పుట్టిన రోజనగా కిట్టూ తల్లిని మళ్ళీ అడిగాడు. "అమ్మా ! నాకు రఘుకు ఉన్నటువంటి గళ్ళసూటు కొనవూ ? సరిగ్గా అట్లాగే ఉండాలి."

"చూద్దాంలేరా !" తెచ్చిపెట్టుకున్న శాంతంతో జవాబిచ్చింది.

"మరి-మిఠాయి కూడా తేవాలి".

"సరేలేరా."

"మరి నా ఫ్రెండ్సందరినీ పిలవాలి."

"అవన్నీ ఇప్పుడెందుకురా ! వెళ్ళి పడుకో" కసిరింది.

రఘు మాదిరిగా తన పుట్టినరోజు కూడా చాలా ఆడంబరంగా సరదాగా జరుగుతుందని తియ్యతియ్యటి కలలు కంటూ తెల్లవార్చాడు కిట్టూ.

తెల్లవారితే ఏముంది ? తలంటి పోసుకున్న కిట్టుకి చాలా సామాన్యమయిన సూటు తెచ్చి వేసుకోమన్నాడు తండ్రి.

"ఇదేం వద్దు నాకు. నాక్కావలసింది రోజా అమ్మకు చెబుతూనే ఉన్నా" విసిరి కొట్టాడు కిట్టు.

"ఒరేయ్. అలా విసిరి కొడితే అది కూడా పోతుంది. శేషుకిచ్చేస్తాను నీ కక్కర్లేకపోతే" అంది శకుంతల బెదిరిస్తూ.

"ఏమిట్రా కిట్టూ! నీ కిది నచ్చకపోతే ఇంకోటి కొంటాంలే. ఇప్పటికిది వేసుకో. రేపే ఇంకోటి తెస్తాను సరేనా?" అన్నాడు తండ్రి కొద్దిగా బ్రతిమిలాడుతూ.

తల్లీ తండ్రీ బ్రతిమిలాడి, ఎంతో నచ్చ చెప్పిన తరువాత, రఘుకు ఉన్నటువంటి గళ్ళసూటు ఇంకొకటి కొంటామని ఆశలు పెట్టిన తరువాత కిట్టూ ఎలాగో ముఖంపెట్టి గునుస్తూ ఆ సూటు తొడుక్కున్నాడు. భోజనాల వేళ "అమ్మా మిఠా ఏది?" అన్నాడు దగ్గుత్తికతో.

శకుంతల కొడుకు పుట్టిన రోజని జీడి పలుకులువేసి పాయసం చేసింది. గిన్నెలో పోసి కిట్టు కిచ్చింది.

"అయితే సాయంత్రం నా ఫ్రెండ్సందరికీ ఇదే పెడతావా?" సున్నాలా మూతిపెట్టి అడిగాడు

"నీ ఫ్రెండ్సుకా! వాళ్ళందరికీ ఎందుకురా? సాయంత్రం మనిద్దరం అలా బైటికి వెళ్దాం. నీకెన్నో తమాషాలు చూపిస్తాను" తండ్రి బుజ్జగించాడు.

కిట్టూ ఆ రోజంతా చాలా విచారంగా ఉన్నాడు. తన పుట్టినరోజు వచ్చిందని ఎంతో సంబరపడ్డ కిట్టూ చిన్నబోయిన ముఖంతో తిరిగాడు. ఆ పసి హృదయానికి ఎంతో ఆశాభంగమయింది. ఆ గళ్ళ సూటును మరిచిపోదామన్నా మరచిపోలేకుండా ఉన్నాడు. రఘు గళ్ళసూటును ఒకసారి చేత్తో తాకి కంటితో చూడాలన్న కోరిక తీగెలు తీగెలుగా ఇంకా సాగుతునే ఉన్నది.

ఒకనాటి సాయంత్రం స్కూలునుంచి ఇంటికి వచ్చిన తరువాత కిట్టూ మెల్లగా మేడ మెట్లెక్కి "రఘూ" అంటూ పిలిచాడు.

రఘు మెట్ల దగ్గరగా వచ్చి "రా కిట్టూ" అంటూ లోపలికి తీసుకువెళ్ళాడు. ఇద్దరూ కిటికీలో నుంచి బైటికి చూస్తూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు

"రఘూ! నీ గళ్ళసూటు ఒకసారి చూడాలనుందోయ్" అన్నాడు కిట్టూ

రఘు అలమారీలో నుంచి తీసి మడత విప్పి చేతికిచ్చాడు.

ఒక్కసారి సూటంతా పట్టిచూసిన కిట్టూకి ముఖం చేటంతయింది.

"ఇటువంటి సూటు వేసుకోవాలనుందోయ్ నాకు- దీన్ని చూసిన దగ్గర్నుంచి" మురిపెంతో అన్నాడు.

"అయితే నీ పుట్టిన రోజుకు ఇటువంటిది కొనుక్కోలేక పోయావా?" అన్నాడు రఘు.

"లేదోయ్, మా నాన్న ఇటువంటిది కొనమంటే ఇంకేదో తెచ్చాడు." అన్నాడు వస్తున్న కన్నీళ్ళను ఆపుకుంటూ కిట్టూ.

దాన్ని ఇటూ అటూ తిప్పి చూసి "రఘూ, దీన్ని ఒకసారి వేసుకుని చూడాలనుందోయ్" అన్నాడు కిట్టూ.

"వేసుకోవోయ్. వేసుకుని ఈ అద్దంలో చూసుకో" అన్నా రఘు కిట్టూను అద్దం దగ్గరికి తీసుకువెళ్లుతూ.

సూటు చేతితో పట్టుకుని నిలబడ్డాడు కిట్టూ తలుపు వైపు చూస్తూ.

"అట్లా భయపడుతూ చూస్తావేం? అమ్మ యింట్లో లేదు. సాయంత్రం ఆరు దాటుతుంది వచ్చేసరికి. భయం లేదు వేసుకు చూడు" అన్నాడు రఘు.

కిట్టూ తన బట్టలు విప్పి, రఘు గళ్ళ సూటు వేసుకుని అద్దంలో చూసుకున్నాడు. అంతా సరిగ్గా సరిపోయింది. ఆ రంగురంగుల గళ్ళు తన ఒంటికెంతో బాగున్నాయి. ఆ సూటు వేసుకుని అద్దంలో చూసుకుంటే ఎంతో సంతోషంగా, ఎంతో సంబరంగా ఉంది. ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ, చేతులూ కాలరూ సర్దుకుంటూ అద్దంలో మళ్ళీ మళ్ళీ చూసుకుంటున్నాడు కిట్టూ.

"కిట్టూ, కిట్టూ", ఆ కేక ఎంతో భయంకరంగా వినిపించింది కిట్టూకి. అది అమ్మ గొంతు. మెట్లమీద నిలబడి తలుపు కొడుతోంది. అతడికి ఆ భయంలో ఏం చెయ్యాలో తోచక అలా నిలబడిపోయాడు.

రఘు తలుపు తీసి అక్కడే నిలబడ్డాడు ఆమెను చూస్తూ.

"ఏం చేస్తున్నావురా!" భయంకరంగా కేక పెట్టింది శకుంతల. ఆమెకు తెలుసు రఘు ఇంటికి కిట్టు వచ్చాడంటే ఏదో కావాలని పేచీ పెడతాడని.

కిట్టుకి నోటి మాట రాలేదు. కాళ్ళూ చేతులూ గజగజ వణుకుతున్నాయి.

"మళ్ళీ ఆ సూటుకోసము వచ్చావా? అది తొడుక్కొని చూసుకుంటు న్నావా? ఛీ ఇంకొకళ్ళది వేసుకోవచ్చా? పైగా అద్దం చూసుకుంటున్నావా వేసుకుని? ఛీ, వెధవ పనులు!" బలవంతంగా ఆ సూటు విప్పేసి కిట్టూ విడిచిన సూటు తొడిగి, చెయ్యి పట్టుకొని బలవంతంగా కిందికి లాక్కొచ్చి కసి తీరా కొట్టింది.

కిట్టు వెక్కివెక్కి ఏడుస్తూ ఒక మూల కూర్చున్నాడు. మిగతా పిల్లలందరూ తమను కూడా అమ్మ కొడుతుందేమోనని భయపడుతూ గోడకానుకొని నిలబడ్డారు.

అంతలో వచ్చాడు కిట్టు తండ్రి కామేశ్వరరావు. అతడిని చూడగానే కిట్టుకి దుఃఖం పొంగింది పైకి. అది చూసి శకుంతలకు కోపం మెక్కువయింది.

"చూడండి ఈ వెధవ ఎంత పని చేశాదో? ఆ యింటికీ ఈ ఇంటికీ వెళ్ళి వాళ్ళు విడిచిన బట్టలు తొడుక్కుంటున్నాడు" అంటూ మళ్ళీ ఒక దెబ్బ కిట్టు వీపు మీద తగిలించింది. "అమ్మో"అంటూ గావుకేక పెట్టాడు కిట్టు తండ్రి వైపుచూస్తూ.

కామేశ్వరరావు కిట్టును ఎత్తుకుని వీపు మీద రాస్తూ "శకుంతలా. చాలా తెలివి తక్కువ పని చేస్తున్నావు. పసివాడనయినా చూడకుండా అంత దెబ్బ కొడతావా? ఈ పసి హృదయానికేం తెలుసు అంతస్తులూ తరతమ భేదాలు? మనం ఈ పసిబిడ్డల చిన్నచిన్న కోరికలనయినా తీర్చలేక పోతున్నాం. ఈ పసిడి చెక్కిళ్లలోని పాలవెన్నెలలను చూడనోచుకోలేదు. ఇంకా కొంతకాలంపోతే పసి బిడ్డలను చూసి సహించలేకపోతామేమో! అమాయకులయిన పసిబిడ్డలను అకార ణంగా శిక్షించకు. ఇదంతా నా ఆలోచనవల్ల వచ్చిన లోపం. తప్పంతానాది" అంటూ గుండెమీద కొట్టుకున్నాడు కామేశ్వరరావు కిట్టును గుండెకు హత్తుకుంటూ.

(పంచాయతీ ప్రభుత్వ పక్ష పత్రిక)